వైఎస్ఆర్

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా ఆదివారం రామన పల్లెలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమైన వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. మాస్కులను, ఐరన్ టాబ్లెట్లను పంచారు. వివిధ వ్యాధుల పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి, ఆహార నియమాల గురించి గ్రామీణ ప్రజలకు వివరించారు. ప్రజలు అనారోగ్య సమస్యలకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా వేసుకోవలసిన వ్యాధి నిరోధక టీకాల గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి దేవి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో పురోగతి తథ్యం

- 'జయీభవ' ప్లానింగ్‌తో ఉత్తమ ఫలితాలు
- 2 నుంచే ఎథిక్స్ పరీక్షలతో శ్రీకారం
- ఇంటర్మీడియట్ ఆర్ఐఒ బండి వెంకటసుబ్బయ్య

ఇంటర్మీడియట్ ఫలితాల మెరుగుదలపై సీరియస్‌గా దృష్టి సారించాం. గత ఫలితాల చేదు అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పకడ్బందీగా సిద్ధమయ్యాం. ఫలితంగా ఇంటర్ ఫలితాల్లో కడప రాష్ట్రంలోని 26 జిల్లాల చివర స్థానం నుంచి మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయనే ధీమాతో ముందుకెళ్తున్నాం. దీంతోపాటు నాలుగు యూనిట్ పరీక్షలు, క్వార్టర్లీ, హాఫ్‌ఇయర్లీ, ప్రీఫైనల్ పరీక్షలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాం. దీనికితోడు ఇంటర్‌బోర్డు అందించిన 50 రోజుల 'జయీభవ' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడమైంది. దీనికితోడు ప్రీఫైనల్ తదితర సంస్థాగత పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సంబంధిత లెక్చరర్లతో ప్రత్యేక తర్ఫీదునిచ్చామని జిల్లాలో పరీక్షల పర్యవేక్షణకు డిఇసి కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరుగుతుందని పేర్కొంటున్న ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకట సుబ్బయ్యతో ముఖాముఖి...

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

ఫలితాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఇంటర్ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కసరత్తు చేయడమైంది. ఇంటర్‌బోర్డు రాష్ట్రవ్యాప్తంగా అందించిన జయీభవ ప్లానింగ్‌ను పకడ్బందీగా అమలు చేశాం. దీనికితోడు ఈఏడాది నాలుగు యూనిట్ పరీక్షలు క్వార్టర్లీ, హాఫ్‌ఇయర్లీ, ప్రీఫైనల్ వంటి ప్రయోగాలను నిశితంగా పరిశీలించాం. సంస్థాగత పరీక్షల ఫలితాల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించడమైంది.

ఫలితాల్లో వెనుకబాటుతనానికి కారణాలేమిటి?

టెన్త్‌కు, ఇంటర్ పరీక్షా విధానానికి వ్యత్యాసం ఉంటోంది. ఇంటర్ పరీక్షల్లో డిస్క్రిప్టివ్ విధానం ఉంటుంది. ఇంటర్ ఫలితాల్లో వెనుకబాటుతనానికి ప్రధాన కారణం క్రీమ్ (తెలివైన విద్యార్థులు) తిరుపతి, విజయవాడ, గుంటూరు హైద్ రాబాద్ పట్టణాల్లోని పలు కార్పొరేట్ కళాశాలలకు పెద్దఎత్తున వెళ్లి పోవడమేనని చెప్పుకోవాలి. మిగిలిన పేదరికం, ఆర్థిక స్తోమత లేని విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు చదువుల పట్ల అవేర్‌నెస్ లేకపోవడం మరొక కారణంగా చెప్పుకోవాలి. ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో అర్హత కలిగిన అనుభవం కలిగిన ఫ్యాకల్టీ ఉన్నప్పటికీ ఫలితాల్లో అట్టడుగున నిలు స్తున్నాం.

పరీక్షల షెడ్యూల్‌ను తెలపండి?

మార్చి ఒకటి నుంచి 20 వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తాం. విభజిత కడప జిల్లాలోని 69 సెంటర్లలో పరీక్షల్ని నిర్వహిస్తున్నాం. దీనికి ముందు ఫిబ్రవరి రెండు నుంచి 23 వరకు జిల్లాలోని 73 సెంటర్లలో ప్రాక్టికల్స్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తాం. ఐదవ తేదీ నుంచి ఒకేషనల్, 11 నుంచి 20వ వరకు జనరల్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తాం. ఫస్టియర్ విద్యార్థులకు ఎథిక్స్, ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ప్రధానమైనవి. ఈమేరకు ఫిబ్రవరి రెండు, 23 తేదీల్లో ఎథిక్స్, ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలుంటాయి. ప్రాక్టికల్స్ వ్యాల్యూయేషన్‌ను డిజిటల్ విధానంలో పరీక్షలు నిర్వహించడంతోపాటు ఏరోజుకు ఆరోజే మూల్యాంకనం చేస్తాం.

కళాశాలలు, విద్యార్థుల వివరాలు తెలపండి?

జిల్లాలో 147 కళాశా లలున్నాయి. 20 ప్రభుత్వ, తొమ్మిది ఒకేషనల్, 11 ఎపిఎస్ డబ్ల్యుఆర్ఎస్, ఐదు ఎయిడెడ్, మూడు మోడల్, 17 కెజిబివి, 10 హైస్కూల్‌ప్లస్, 72 ప్రయివేటు కళాశాల లున్నాయి. జిల్లా వ్యాప్తంగా 34,272 మంది విద్యార్థులున్నారు. జనరల్‌లో 31,648 మంది విద్యార్థుల్లో ఫస్టియర్‌లో 16,177 మంది, సెకెండ్ ఇయర్‌లో 18,095 మంది విద్యార్థులు ఉన్నారు.

పరీక్షల ఏర్పాట్ల గురించి చెప్పండి?

జిల్లాలోని 73 సెంటర్లలోని 720 గదుల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాం. బెంచ్‌లు, తాగునీరు, మెడికల్, విద్యుత్ సదుపాయాల కల్పనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల రాకపోకలకు సంబంధించి ఆర్‌టిసి సహకారాన్ని తీసుకోవడమైంది.

పరీక్షల పర్యవేక్షణ గురించి తెలపండి?

జిల్లాలోని 15 సెంటర్లను సెన్సిటివ్‌గా గుర్తించాం. 73 సె ంటర్ల పర్యవేక్షణలో భాగంగా సెన్సిటివ్ కేంద్రాలపై నిఘా వేయడ మైంది. ఇందులోభాగంగా ప్రతి 20 సెంటర్లకు మూడు ఫ్లయింట్ స్క్వాడ్స్,సెన్సిటింగ్ కేంద్రాల్లో మూడు సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయడమైంది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- పూర్తికాని సిలబస్
- సమీపిస్తున్న పరీక్షలు
- ఆందోళనలో మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కాశినాయన

ఒకవైపు పరీక్షలు సమీపిస్తున్నాయి.. మరో వైపు ఇంకా సిలబస్ పూర్తి కావడం లేదు.. వెరసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. దీనికంతటికి ఉపాధ్యాయులే కొరతే ప్రధాన కారణం. మండల కేంద్రంలోని నరసాపురంలో ఉన్న ఎపి మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పరీక్షలు దగ్గర పడుతుండడం, సిలబస్ పూర్తికాకపోవడం.. తాము పరీక్షలు ఎలా రాయాలో అనే ఆందోళనతోపాటు అర్థం కాని సమస్యగా విద్యార్థుల్లో మొదలైంది. మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థుల కోసం ఇంగ్లీషుమీడియం విద్యను బోధించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఎపి మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. ప్రతి పాఠశాలలోనూ సమారు 500 మంది ఉపాధ్యాయులుంటారు. నరసాపురంలో ఉన్న పాఠశాలలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు సోషియల్, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో సిలబస్ పూర్తి కాలేదు. దీంతో రాబోయే పరీక్షలు ఎలా రాయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కార్పొరేట్ ధీటుగా ఎపి మోడల్ స్కూల్‌లో విద్యాబోధన ఉంటుందని ప్రజాప్రతినిధులు, అధికారులు ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తున్నా వాస్తవం వేరేలా ఉంది. కేవలం వారి మాటలు పరిమితమయ్యాయని, సిలబస్ పూర్తి కాకపోతే తమ పిల్లలు పరీక్షలు ఎలా రాసి పాసవుతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వండేందుకు వంటి గదిని కూడా ఇప్పటికీ నిర్మించలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయుల కొరతను తీర్చి విద్యార్థుల భవిష్యత్‌కు పాటుపడాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు లేకపోతే చదువు ఎలా వస్తుంది

ఇంగ్లీష్ మీడియం స్కూలు అని ఎంతో ఆశపడ్డాం. అసలు ఉపాధ్యాయులు లేకపోతే చదువు ఎలా వస్తుంది. ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యం తగదు. ఉపాధ్యాయులుంటేనే విద్యార్థులకు చదువు వస్తుంది. పరీక్షలు దగ్గరో ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.

- చైతన్యమౌలిక, విద్యార్థి తల్లి.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయం వాస్తవమే. కొరత ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వానికి నివేదిక అందించాం. ప్రభుత్వమే ఉపాధ్యాయులను నియామకం చేపట్టాలి. ఉన్న ఉపాధ్యాయులతోనే చదువు చెప్పిస్తున్నాం.

-ప్రిన్సిపల్ సౌజన్య, ఎపి మోడల్ స్కూల్

12వ పిఆర్‌సి కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023, జూలై నుంచి వర్తించేవిధంగా 12వ పిఆర్‌సిని అమలుచేయాలని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాష్ట ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో సిఎస్ఐ పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతనసవరణ సంఘం కమిషన్ ను ఏర్పాటు చేసి ఆరు నెలలైనా ఇంతవరకు భాధ్యతలు చేపట్టలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చించి 30శాతం ఫిట్మెంట్ తో పిఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు నాలుగు సంవత్సరాలుగా రావాల్సిన ఆర్థికపరమైన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. 2018 నుంచి రావాల్సిన కరువు బత్యం బకాయిలను చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి ఏకమొత్తంగా చెల్లించాలన్నారు. ఎపిజిఎల్ఐ రుణాలను, ఫైనల్ పేమెంట్‌లను రెండు సంవత్సరాలుగా చెల్లించలేదన్నారు. ఆర్జిత సెలవుల బిల్లులను ట్రెజరీలకు సమర్పించి రెండు సంవత్సరాలైనా నగదు చెల్లించలేదన్నారు. జాప్యం చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ నిచ్చి మాటతప్పడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు భాస్కర్ రెడ్డి, నాగరాజు, రాష్టకౌన్సిలర్లు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, గురయ్య, సురేంద్రనాథరెడ్డి, జిల్లా కార్యదర్శులు మునివర్ధన్ కుమార్, రమేష్ రెడ్డి, జిల్లాఉపాధ్యక్షులు గురయ్య, బాలజ్యోజి, నరసింహారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు, అప్సర్ బాష, జిల్లా కౌన్సిలర్లు మణికుమార్, బాబుల్ రెడ్డి, సుబ్బయ్య, సత్తార్, రామదస్తగిరిరెడ్డి, ఖాజాపీరా, వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, సాంబశివుడు, ఫయాజ్‌తో పాటు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలేవి? : విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి జిల్లాలో ప్రయివేట్ బిఇడి కళాశాలల యాజమాన్యాలు, మేనేజ్‌మెంట్ తరపున అక్రమంగా అడ్మిషన్లు నిర్వహించారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, సిడిసి రఘుబాబులుకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి విచారణ జరపలేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న ఆరోపించారు. నగరంలోని ఆదివారం పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రియవేట్, బిఇడి కళాశాలల యాజమాన్యాలు ఉన్నత విద్యా మండలి, యుజిసి నిబంధనలకు విరుద్ధంగా కౌన్సెలింగ్ పూర్తికాకమునుపే బిఇడి అడ్మిషన్లు మేనేజ్మెంట్ తరపున ఇష్టానుసారంగా ఇతర రాష్ట్రాల చెందిన విద్యార్థులను చేర్చుకుని పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు స్వయంగా ఫిర్యాదు చేసిన విసి సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య,సిడిసి రఘుబాబుల ఎటువంటి చర్యలు తీసుకోకుండా విచారణ జరపకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. తొత్తులగా మారారని మండిపడ్డారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, పిడియస్ యు జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక తన నివాసంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.7.25 లక్షల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకంలో ప్రస్తుతం రూ.5 లక్షల నుండి రూ.25 లక్షలకు పెంచడం అద్భుతమని, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని అన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ఆర్థిక సాయం అందించామని చెప్పారు. తొలుత కడప నగరానికి చెందిన వరదబోయిన సుమలత, భీమచర్ల స్వాతి, ఆడవాల చంద్ర మున్నెయ్య, సయ్యద్, రెహన బిబి, శ్రీనివాసులుకు రూ. 7.25 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారోరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అరీఫుల్ల, నాయకులు జయచంద్రారెడ్డి, నారపురెడ్డి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, గోపాల్‌కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

సమవేశంలో మాట్లాడుతున్న దూదేకుల భవన కమిటీ నాయకులు

పరస్పర సహకారంతోనే సత్ఫలితాలు

ప్రజాశక్తి -కడప సిటీ

దూదేకులు పరస్పర సహకారంతోనే సత్ఫలితాలు సాధ్యమనే సత్యాన్ని గ్రహించి నడుచుకోవాలని దూదేకుల భవన కమిటీ నాయకులు అజ్మతుల్లా, ఆయిల్ మిల్లు ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల భవన్‌లో దూదేకులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూసుకోవద్దన్నారు. ఎదుటి వారిలోని లోపాలను వెదకడం సులభమనే సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. పాజిటివ్ ధోరణితో ముందుకు సాగాలని తెలిపారు. వ్యక్తిగత సంబంధాలను బంధుత్వాలుగా మార్చుకోవడం ద్వారా సమ సమాజం సాధ్యమవుతుందన్నారు. తద్వారా సామాజికంగా అభివృద్ధి చెందుతామన్నారు. చిన్న చిన్న లోపాలను వేలెత్తి చూసుకుంటే కులాంతర వివాహాల పరిస్థితి ఏమిటో ఆలోచన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మన్నూరు అక్బర్, బాబయ్య, ఖాదరయ్య, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ హుస్సేన్, దస్తగిరితోపాటు పలువురు సంఘం సోదరులు పాల్గొన్నారు.

వైసిపి సభ్యత్వానికి రాజీనామా

పోరుమామిళ్ల : వైసిపి స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కమ్మవారిపల్లె ఎంపిటిసి రమణ వైసిపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటానని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నానని పార్టీలో ఉండనని తేల్చి చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైసిపిలో ఉంటూ ప్రజలకు సేవ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఆయన సోమవారం టిడిపిలో చేరే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కడప : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాస్టర్ పి.మహేష్ సూచించారు. కడప నగరంలోని 48 డివిజన్ కృపా కాలనీలో గల న్యూ నేటివ్ కృపా చర్చిలో ఆదివారం దైవజనులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కలిసి విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలంతా ఆధ్యాత్మికంగా ఎదుగుతూ, ఐకమత్యంగా ఆత్మీయంగా ఉండాలని, యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరమై మంచి అలవాట్లతో ఉన్నతంగా ఎదుగుతూ, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, ఎ.రవి, మహిమ నిరీక్షణ, ఆగస్టీన్, భవనమ్మ, శివమ్మ, చిట్టెమ్మ, ఏ.లీలావతి, పి.రోజా అనేక మంది విశ్వాసులు పాల్గొని ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

16న నిరసనను జయప్రదం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలని ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్, భాస్కర్ , శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ఒకవైపున పెట్రోల్ డీజిల్, గ్యాస్, ధరలను విపరీతంగా పెంచేసి, ప్రజల నెత్తిన భారాలు వేయడమే కాక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబానీ, అదాని వంటి కార్పోరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించిన నరేంద్ర మోడీ రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. అదాని, అంబానీలను కుబేరులను చేసి, రైతులను, వ్యవసాయ కార్మికులను అప్పులు పాలు చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని అన్నారు. నిరంకుశ పరిపాలన సాగిస్తున్న కేంద్ర బిజెపి, నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు సీటు 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని పేర్కొన్నారు. కేరళ రాష్ట్ర విధానాన్ని అమలు చేయాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రుణ ఉపశమన చట్టాన్ని చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు పెంచి, వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఆన్లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న కౌలు రైతులకే, నష్టపరిహారాలు బీమా సౌకర్యం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె గ్రామీణ ప్రాంత బంద్ జయప్రదం కోసం జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు బాదుల్లా, మల్లికార్జున, మద్దిలేటి సుబ్బారాయుడు, రైతు సంఘం నాయకులు యానాదయ్య, బాలచంద్రరయ్య,శంఖర్ రెడ్డి, బద్రయ్య, కొండయ్య, గురవయ్య, పక్కిరప్ప పాల్గొన్నారు.

టిడిపి పాలనలో అధిక పెట్టుబడులు

కడప అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగాలు కల్పన చేయలేక పోవటంతో యువతకు ఉద్యోగాలు రాక 1,745 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ జాబ్ కేలెండర్ ఇస్తామని ఇవ్వలేదని జగన్ ప్రభుత్వం యువతను దగా చేసిందన్నారు. దేశంలో 11శాతం నిరుద్యోగ సమస్య ఉంటే ఈ ప్రభుత్వం నిర్వాహకంతో 24 శాతానికి చేరుకుందని తెలిపారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడిన దాని మూలాలు ఆంధ్రప్రదేశ్ లోనే ఉండటం ఈ ప్రభుత్వం అరాచక పాలనకు నిదర్శనమన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత గంజాయి మత్తులో మునిగితేలుతున్నారని, ఫలితంగా క్రైమ్ పెరిగిందన్నారు. టిడిపి పాలనలో పెట్టుబడుల్లో ప్రథమ స్థానంలో ఉండే వైసిపి పాలనలో స్మగ్లింగ్ లో ముందు వరుసులో నిలవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం, మంజూరు అహమ్మద్, ఖాదర్ సాహెబ్, లక్ష్మయ్య, రోషన్ పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగవు : టిడిపి

కడప అర్బన్ : డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తమను వ్యక్తిగతంగా విమర్శించడం తగదని టిడిపి పోలిటీ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి అన్నారు. ఆదివారం అష్ట లక్ష్మి కళ్యాణ మండపంలో ఆర్ఎస్‌యూ రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు రవిశంకర్ రెడ్డి అతని అనుచరులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఫ్లెక్సి రాణి అని మాధవిరెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు సంస్కారం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లడానికి ఫ్లెక్సిలు వేశామని, కార్పొరేషన్ ట్యాక్స్‌లు కట్టి ఫ్లెక్సిలు వేస్తున్నామని చెప్పారు. అంజాద్‌బాషా, అతని తమ్ముడు, అల్లుడు పుట్టిన రోజుకు ఫ్లెక్సిలు వేసుకున్నారని తెలిపారు. కబ్జాల పంపకాల్లో తేడా వచ్చి నడిరోడ్డు పై హత్యలు చేసుకుంటున్న వైసిపి శ్రేణులు అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కాకపోయినా ప్రజా క్షేత్రంలో ఉన్నామని చెప్పారు. అంజాద్ బాషా కబ్జాలపై డిబేట్ కి సిద్ధం అన్ని సవాల్ విసిరారు. కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, రాష్ట్ర బెస్త సాధికారిక సంఘం అధ్యక్షులు రాంప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

జాకట రమేష్‌కు ఉత్తమ దర్శక అవార్డు

కడప అర్బన్ : తిరుపతి మహతి ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తిరుపతి 2024 ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్‌లో ఉత్తమ దర్శకుడి విభాగంలో నందమూరి తారకరత్న హీరోగా నటించిన సారధి చిత్రానికి గాను జిల్లాకు చెందిన దర్శకుడు జాకట రమేష్ ప్రముఖుల చేత అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ తాను తీసుకున్న అవార్డు వెనకాల నందమూరి తారకరత్న కష్టం ఎంతో ఉందని చెప్పారు. కొత్త డైరెక్టర్ అయినప్పటికీ ఆయన ప్రోత్సాహం మాటల్లో చెప్పలేనని పేర్కొన్నారు. టెక్నీషియన్లు వారి శక్తికి మించి ఈ సినిమాకు సపోర్ట్ చేశారని తెలిపారు

'నయీమ్'కు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రముఖ గాయకుడు నయీమ్‌కు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా జీవిత సాఫల్య పురస్కారాన్ని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష ఆదివారం అందించారు. ప్రశంసా పత్రం, మెమోంటోతోపాటు రూ. 5 వేల నగదును ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సిఎం గాయకుడిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాలుగున్నర దశాబ్దాలుగా నయీమ్ సంగీత రంగంలో సేవాలందిస్తూ వందలాది కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. దీనికి గుర్తింపుగా ప్రభుత్వం లైఫ్ టైం అచీవమెంట్ అవార్డుతో పాటు నగదును అందించిందన్నారు. అవార్డు గ్రహీత నయీమ్ మాట్లాడుతు తన సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నదన్నారు. ఈ అవార్డు ఇచ్చిన ప్రభుత్వానికి, డిప్యూటీ సిఎం అంజాద్ బాషకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలుసంఘాల నాయకులు సత్తార్ ఫైజి, ఫర్హతుల్లా, మున్నా అరీఫ్, జెకె యూత్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుంది

పులివెందుల రూరల్ : జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా కొత్త రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మిట్ట శ్రీహరి, కోశాధికారిగా కాంబోజి గంగాధర్ ఆదివారం పట్టణంలోని రోటరీపురం సమీపంలో ఉన్న వాసవి కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికైన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పటికీ అందిస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్య సంఘ సభ్యులు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలని కోరారు. ఆ బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా ఆర్యవైశ్య సభ్యులు ఎంపీ అవినాష్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్లపల్లి కిషోర్, లక్ష్మీభార్గవి, గుల్జార్, కరుణాకర్, అయ్యప్ప శీను, టైగర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు..

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి

కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

ప్రజ్ఞావికాసం పరీక్షను విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 6న పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస్ మోడల్ టెస్టు పరీక్షను విజయవంతం చేయాలని జీవన్‌జ్యోతి హైస్కూల్ వద్ద ఆ పాఠశాల కరస్పాండెంట్ అమర్నాథ్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రం డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఈ పరీక్ష పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త కెఎస్ లక్ష్మణరావు తయారు చేశారన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 వరకు ఉంటుందన్నారు. ప్రతిభ కనబ రిచిన విద్యార్థులకు మండలస్థాయిలో మొదటి మూడు బహుమతులు, జిల్లా స్థాయిలో టాప్ 10 ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ.20 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. వివరాలకు 95024 94474, 91606 14313, 82977 62173 నెంబర్లను సంప్రదించాలన్నారు. కిరణ్, ప్రదీప్ పాల్గొన్నారు.

'రాజోలు' నిర్మించకపోవడంలో అన్ని పార్టీలదీ తప్పిదమే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కెసి కెనాల్ రైతులకు, జిల్లా తాగునీటి అవసరాలకు ఉద్దేశించబడిన రాజోలు ప్రాజెక్ట్ ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి అన్ని పార్టీలది తప్పిదం, నమ్మక ద్రోహం అని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు తాము న్యాయం చేశాం అంటూ ఎవరికివారు సభలు, సమావేశాలు పెడుతూ రైతులను మళ్లీ మోసం పుచ్చుతున్నారని తెలిపారు. రాయలసీమకులో రాజధాని ఏర్పాటై ఉంటే మహా నగరంగా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. రైతు ఉత్పత్తులకు దళారులతో సంబంధం లేకుండా అధిక ధరలు దక్కేవని తెలిపారు. రాయలసీమ కోల్పోయి తెలంగాణకు దక్కిన హైదరాబాద్ ఇందుకు సాక్ష్యమన్నారు. అక్కడ రైతుల ఉత్పత్తులకు అధిక ధరలు లభిస్తున్నాయన్నారు. రాయలసీమలో రాజధాని అవసరం ఉందని తెలిపారు. కెఆర్ఎంబి (క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డ్)ను కడప జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. క్రిష్ణా జలాల్లో రాయలసీమకు మోసం జరుగుతున్నా.. రాయలసీమ అధిక నీళ్లు దోచుకుపోతోందని తెలంగాణాలోని అన్ని పార్టీల వాళ్లు విమర్శిస్తూ ఉన్నారన్నారు. ఆంధ్ర నాయకులు ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రతాప్‌రెడ్డి కోరారు.

ధర్నా నిర్వహిస్తున్న లబ్ధిదారులు, సిపిఎం నాయకులు

కొనసాగుతున్న సిపిఎం దీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్‌నగర్‌లో కనీస వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు చేపట్టిన దీక్షలు 11వరోజు ఆదివారం కూడా కొనసాగాయి. ధర్నాను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ గత సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తే, కలెక్టర్ స్పందిస్తూ పేదలు బేస్ మట్టాలు వేసుకున్న స్థలాల్లో విద్యుత్, మంచినీరు, రోడ్లకు సంబంధించి హౌస్ వారికి అప్పజెప్పి ఎస్టిమేషన్ వేసి పంపాలన్నారు. ప్రొద్దుటూరు హౌసింగ్ డిఇ కార్యాలయ సిబ్బందితో కలిసి అమృత్‌నగర్లో పర్యటించి దానికి సంబంధించిన అధికారులకు లెటర్లు పంపారన్నారు. అధికారులు త్వరగా కనీస వసతులు కల్పించాలన్నారు. అధికారులు స్పందించకపోతే సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మధు, ఉషన్, బాషా, పార్వతి, హసీనా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న జనసేన నాయకులు

జనసేన అవగాహన సదస్సు

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక పాశం కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం జనసేన పార్టీ నాయకులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య వారి అనుచర వర్గంతో రాబోవు ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలి అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా బి.సి.రమణ

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రజా సోషలిస్ట్ కూటమి కడప పార్లమెంటరీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రజా సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కన్వీనర్ బి.సి. రమణ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో ప్రజా సోషలిస్ట్ కూటమి రాష్ట్ర సదస్సును వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి అజెండాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బరిలో దిగుతుందన్నారు. అందులో భాగంగా కడప పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానన్నారు. చైతన్యం తీసుకురావడానికి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజా సోషలిస్ట్ కూటమి ద్వారా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేయిస్తున్నామని చెప్పారు.

బిసి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-నందలూరు

బిసి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడంరెడ్డి బాబు, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం నందలూరు బిసి బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల వసతి సౌకర్యాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్ వసతి గృహంలో విద్యా ర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇన్‌చార్జి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడం, రాత్రి వేళల్లో విద్యార్థులు వసతి గృహంలో నిద్రించకుండా ఇళ్లకు వెళుతున్నారని అన్నారు. అధికారులు దృష్టి సారించి హాస్టల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప నగర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఎండి యూసఫ్, పాల్గొన్నారు.

వేరుశనగ నూర్పిడి ముమ్మరం

దిగుబడి, ధరలు ఆశాజనకం - రైతుల్లో హర్షం

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండలంలో సాగు చేసిన వేరుశనగ పంట నూర్పిళ్లు రైతులు ముమ్మరం చేశారు. వెదురూరు, రాజుపాలెం, నరహరిపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో సుమారుగా 2వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తికావడంతో నూర్పిడి చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు నూర్పిడి పనులు పూర్తయ్యాయి. కొంతమంది రైతులు కూలీలతో నూర్పిడి పనులు చేయిస్తుండగా, మరికొంతమంది కూలీలతో వేరుశనగ పంటను పీకించి, తర్వాత యంత్రాల ద్వారా కాయలను నూర్పిడి చేయిస్తున్నారు. కూలీలకు ఒక బస్తా వేరుశనగ కాయలు నూర్పిడి చేసినందుకు రూ.700 చెల్లిస్తున్నారు. ఎకరా పంట నూర్పిడి చేసినందుకు యంత్రానికి రూ.6వేలు ఖర్చు వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పంట పూర్తిగా నూర్పిడి చేసేందుకు రూ.13వేలు అవుతుందని తెలుస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరాకు 36 నుంచి 40బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ఎకరా వేరుశనగ పంట సాగుకు, ఎరువులు, మందులు నూర్పిడి వరకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బస్తా ధర రూ.2,800 నుంచి రూ.3వేల వరకు ఉంది. చాలా మంది రైతులు పంట పొలాల్లో వేరుశనగ కాయలు తూకాలు వేస్తున్నారు.

తిప్పిరెడ్డిపల్లె వద్ద యంత్రంతో వేరుశనగ పంట నూర్పిడి చేస్తున్న కూలీలు

వేరుశనగ పంట నూర్పిడి చేసేందుకు కూలీల కొరత అధికంగా ఉండడంతో చెన్నూరు, మైదుకూరు, ఖాజీపేట ప్రాంతాల నుండి ఆటోల్లో పిలిపిం చుకుంటున్నారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేరుశనగ పంట నూర్పిడి చేసినందుకు రూ.300 చెల్లించి, ఆటో బాడుగ రైతులు భరిస్తున్నారు. ఈ ఏడాది వేరుశనగ సాగు వలన మేలు జరిగిందని, అయితే చాలా వరకు సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు.

ప్రతినెలా ఎకరాకు రూ.50 వేలు సంపాదన

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్

రైతు శాస్త్రవేత్తల గురించి వివరిస్తున్న టి.విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రైతు శాస్త్రవేత్తలు ప్రతి నెలా తమ పొలం ద్వారా ఎకరాకు రూ.50వేలు సంపాదించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రంలో ఆదివారం రైతు శాస్త్రవేత్తలకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మీ పొలాలు ఏ గ్రేడ్‌లో ఉండాలని, ఎప్పటికప్పుడు పొలంలో వస్తున్న మార్పులను గమనిస్తూ శాస్త్రీయతను గమనించాలని సూచించారు. రైతు శాస్త్రవేత్తలు రైతులందరికీ దిక్సూచిగా నిలవాలని, గ్రామాలను పర్యావరణ హిత గ్రామలుగా తీర్చిదిద్దాలని కోరారు.

అకాడమీ ప్రాంగణంలో మొక్కలు నాటిన అంతర్జాతీయ బృందం

పట్టణ పరిధిలోని అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రాన్ని ఆదివారం అంతర్జాతీయ ప్రతినిధి బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అకాడమీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రాంగణం పరిధిలో రూపొందించిన ఏ గ్రేడ్, ఏటీఎం, డీపీఎం ఐదు అంతస్తుల నమూనా క్షేత్రాలను సందర్శించారు. ఆయా మోడల్స్ గురించి రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ విదేశీ బృంద సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా విజయ కుమార్‌తోపాటు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టం శ్యామ్యూల్ ఆనంద్, సీనియర్ సలహాదారులు జి.మురళీధర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్, థిమాటిక్ లీడ్‌లు సుధాకర్, విషి, సురేష్, ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, వైఎస్ఆర్ కడప జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ రాజు, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, అకాడమీ అధికారులు సందీప్, శుభకర్ పాల్గొన్నారు.

విదేశీ బృందంతో కలిసి మొక్కలు నాటుతున్న రైతు శాస్త్రవేత్తలు

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

వైసిపి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎంపిపి, జడ్‌పిటిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలో దళితవాడలో 50 తటస్థ కుటుంబాలు ఆదివారం ఎంపిపి లక్ష్మి గాయత్రి, వైసిపి నాయకుడు జయరాం ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. వీరికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. చేరినవారిలో ఇందుకూరు ఆంజనేయులు, కలమల్ల శ్రీనువాసులు, అట్లూరి శేషాద్రి, ముద్ది గంగన్న, శ్రీకాంత్, సురేంద్ర, పవన్, బాల సుబ్బయ్య, శ్రీరాములు, గంగాధర్‌తోపాటు పలువురు ఉన్నారు. ముందుగా ఎంపీకి భారీ ఎత్తున బాణసంచా కాల్చి కాలనీవాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగనన్న చేపట్టే పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. రాబోవు ఎన్నికల్లో సిఎం జగన్‌రెడ్డికి గతం కంటే మంచి మెజార్టీ తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని రామిరెడ్డిపల్లిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీ ప్రారంభించారు. రాజీవ్ కాలనీలో కూడా కొంతమంది టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరి పార్టీ కండువాలు వేసుకున్నారు. ప్రజలు, అధికారులు, నిరుద్యోగ యువత నుండి ఎంపీ అవినాష్‌రెడ్డి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటిసి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ప్రతాప్ రెడ్డి, జయరాం, బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, మండల కో-ఆప్షన్ మెంబర్ అసనయ్య, ఎంపిటిసిలు భారతి, పద్మా జయలక్ష్మిదేవి, ముత్యాల రమేష్, బండల షుకూర్, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు బిఎస్ షెక్షావలి, రవిశంకర్ గౌడ్, మాజీ ఎంపిటిసి గంగరాజు, కొత్తూరు రెడ్డయ్య, మండల ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, వక్ఫ్ బోర్డు సభ్యుడు ఖదీర్, నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలా నష్టపోయిన ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉద్యోగులు అన్ని విధాలా నష్టపోయారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్టిపిపిలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు పాదయాత్రలో అధికారం వచ్చిన వెంటనే ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, మళ్లీ ఎన్నికలు వచ్చినా ఆ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు రావలసిన జీతాలు, టిఎ, డిఎలకు కూడా ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉక్కు పరిశ్రమ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో పూర్తిచేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నట్లు ఆర్భాటంగా రెండుసార్లు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలని ఎండగడుతూ, టిడిపి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, యూనియన్ నాయకులు, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో ప్రజలకు అభివాదం చేస్తున్న భూపేష్‌రెడ్డి

ఓబులేసు ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

చియ్యపాడులో తాగునీటికి కటకట

పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో కొద్దిరోజులుగా నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ఇన్‌ఛార్జి సర్పంచ్ ఓబులేసు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపడుతున్నారు. కొన్ని నెలల నుంచి గ్రామంలోని బోర్లలో నీరు అడుగంటి సమస్య తలెత్తింది. జనరేటర్ల ద్వారా మోటర్లు ఆడించి కూడా గ్రామంలో నీటి సరఫరా చేశారు. ప్రస్తుతం నీటి ఎద్దడి అధికం కావడంతో ఎస్సీ కాలనీలో ట్యాంకర్ల ద్వారా ఆదివారం నీటి సరఫరా చేపట్టారు. తాగునీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - చాపాడు

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీకి చెందిన బాలికల జట్టు ఖోఖోలో నియోజక వర్గస్థాయిలో మొదటి స్థానం, బాలుర జట్టు ఖోఖో పోటీలో రెండవ స్థానం నిలిచారు. గెలిచిన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఖోఖో బాలికల క్రీడాకారులకు రూ.25 వేలు, బాలురకు రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడల్లో బాగా పాల్గొని పథకాలు పొంది నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

క్రీడాకారులకు పుట్టా అభినందనలు

ప్రోత్సాహక నిధిని గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు వాడుకుంటామని క్రీడాకారులు చెప్పడంతో సుధాకర్ యాదవ్ అభినందించారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్లవోలు సుధాకర్‌రెడ్డి, దువ్వూరు మండల శాఖ అధ్యక్షులు వెంకట రమణారెడ్డి, టిడిపి నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, రాంబాబు, తాహిర్ హుస్సేన్, అందె శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నాగరాజు, గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

వైసిపి ఉన్మాదిలా తయారైంది

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ఉన్మాది, పిరికిపంద పార్టీలా తయారైందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, రాష్ట్ర సమస్యలపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తూంటే వైసిపి నాయకులు వాటికి సమాధానం చెప్పకుండా ఆమెపై వ్యక్తి గత విమర్శలు చేయడం శోచనీయమన్నారు. పరోక్షంగా షర్మిలా తల్లి విజయమ్మపై కూడా విమర్శలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లి, చెల్లిని వైసిపి ఉన్మాదులు విమర్శిస్తుంటే ముఖ్యమంత్రి జగన్ నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉండడం గర్హనీయమని తెలిపారు. వీరే రేపు జగన్, ఆయన కుటుంబ సభ్యులను విమర్శిస్తారనే వాస్తవ విషయాన్ని సిఎం జగన్ గ్రహించాలని సూచించారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయని జగన్ తమకు కూడా న్యాయం చేయరనే వాస్తవాన్ని విమర్శకులు గ్రహించాలని కోరారు. ధరలు, చార్జీలు పెంచి ప్రజలకు ఎన్ని సార్లు బాదినాడో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు.

15 మంది అధికార ప్రతినిధుల నియామకం : ఎపి ఛీఫ్ షర్మిలారెడ్డి, ఎఐసిసి ఎపి ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ ఆదేశాల మేరకు 15 మందిని రాష్ట్ర అధికార ప్రతినిధులుగా నియమించినట్లు తులసిరెడ్డి చెప్పారు. ఆదివారం వేంపల్లెలో ఆయన అధికార ప్రతినిధుల పేర్లను ప్రకటించారు. చింతాడ దిలీఫ్ (శ్రీకాకుళం, ఎం.శ్రీనివాసరావు(విజయనగరం), వెంకట్రావు(విశాఖపట్నం), శివగణేష్ (తూర్పు గోదావరి), గంగయ్య (పశ్చిమ గోదావరి), సతీష్ (కృష్ణా), డి.రామకృష్ణ (గుంటూరు), శ్రీపతి సతీష్(ప్రకాశం), సురేష్‌బాబు(నెల్లూరు), రాంభూపాల్‌రెడ్డి (అనంతపురం), విజయ్‌జ్యోతి(వైఎస్ఆర్), శ్రీనువాసులు (కర్నూలు), గోవర్ధన్‌రెడ్డి (చిత్తూరు), తాండకొండ వెంకటేశ్వరరావు (బాపట్ల), ఎబిఎన్ వర్మ(విశాఖపట్నం) ను అధికారి ప్రతినిధులుగా నియమించినట్లు చెప్పారు. సమావేశంలో ధృవకుమార్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహరెడ్డి, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, చెన్నకేశవ, బాలం సుబ్బరాయుడు, శివ, రవి, వినయ్, మహబూబ్ బాషా, బద్రి, రాఘవయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి : 'పుట్టా'

ప్రజాశక్తి - దువ్వూరు

తనకు ఈ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వండని టిడిపి మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సధాకర్ యాదవ్ కోరారు. మండల పరిధిలోని బుక్కాయపల్లె గ్రామంలో ఆదివారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయనకు మహిళలు కోలాటం వేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పుట్టా మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేసే దానికి సిద్ధంగా ఉన్నానని, తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయినా తనకు ప్రజలే ముఖ్యమని ఆయన తెలిపారు. దువ్వూరు గ్రామానికి చెందిన కోనేటి హరి ఆధ్వర్యంలో దాదాపు 30 కుటుంబాలు పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. కార్యక్రమంలో జనసేన మైదుకూరు ఇన్‌ఛార్జి మల్లోత్ర, టిడిపి మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న సుధాకర్ యాదవ్, నాయకులు

ప్రజాసంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

పులివెందుల రూరల్ : మున్సిపల్ పరిధిలోని రోటరీపురం కాలనీలో బిటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డి ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రోటరీపురానికి బీటెక్ రవికి జిల్లా పార్ల మెంటు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి హక్కులగారి విజయ్ కుమార్‌రెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు. అనం తరం బిటెక్ రవి ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను విరించారు. సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు తూగుట్ల మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు జోగిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొరియర్ ప్రసాద్‌రెడ్డి, లింగాల ఇన్‌ఛార్జి విశ్వనాథాఒడ్డి, జిల్లా కార్యదర్శి గడ్డం అమర్‌నాథ్, జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, ఖాసింవలి, రహంతుల్లా, దేవి, ఖాసింబీ, శాంతికుమారి, శకుంతల, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిటెక్ రవికి స్వాగతం పలుకుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

ఎంఇఒ వీరారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వీరారెడ్డిది అంకితభావంతో పనిచేసే గుణం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఎంఇఒగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బండి వీరారెడ్డి అంకితభావంతో పనిచేసే గుణంగల వాడని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శిల్పారామం సమీపంలో ఉన్న సాయిబృందావన్ గార్డెన్‌లో ఎంఇఒ బండి వీరారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి విరమణ సహజమన్నారు. వీరారెడ్డి తన వృత్తి పట్ల ఎంతో శ్రద్ధగా అంకితభావంతో ఎని చేసేవారన్నారు. అనంతరం పలువురు ఆయనను ఉద్దేశించి ప్రసంగించారు. మండలంలోని ఉపాధ్యాయులు వీరారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీకే వెంకట్‌నాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సుషెల్టర్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని చిన్న ఓరంపాడు క్రాస్ దగ్గర ఎపి టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ కొత్త లూరు సాయికిషోర్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మిస్తున్న బస్సు షెల్టర్ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వారు అవస రాల నిమిత్తం బస్‌షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చినప్పుడు బస్సు షెల్టర్ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుక వచ్చారని అన్నారు. వెంటనే స్పందించి తన సొంత నిధులతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సమ స్యలు తన దృష్టికి తీసుకవస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియ జేశారు. కార్యక్రమంలో కొర్లకుంట ఉపసర్పంచ్ ముక్కా రూపేష్ రెడ్డి, వైసిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మధురెడ్డి,రామమోహన్ పాల్గొన్నారు.